RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే QUICK TODAY

ఆదివారం 28 డిసెంబర్ 2025 quicktodaynews.com



# పీర్జాదిగూడ.. హీరో టు జీరో

## జీహెచ్ఎంసీ డీలిమిటేషన్స్‌తో ఉనికి కోల్పోయిన నగరం

### రాజకీయ కక్షలతో సర్కిల్ కు కూడా నోచుకోని నగర పాలక సంస్థ

### మున్సిపల్ కార్పొరేషన్ స్థాయి నుంచి సాధారణ వార్డుగా మార్పు

### దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన పీర్జాదిగూడ పేరు కనుమరుగు

### ఓ రాజకీయ నేత ఏకచత్రాధిపత్యం కోసమే నగరం గుర్తింపు రద్దు?

### నాయకుల తీరుపై మండిపడుతున్న పీర్జాదిగూడ నగర ప్రజలు




**సాధారణంగా ఒక గ్రామం మేజర్ గ్రామ పంచాయతీగా, మున్సిపాలిటీగా, మున్సిపల్ కార్పొరేషన్‌గా దశల వారీగా ఏర్పడుతాయి.. కానీ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఇందుకు భిన్నంగా అవతరించి చరిత్ర సృష్టించింది. హైదరాబాద్ శివారు ప్రాంతం కావడంతో అనతి కాలంలోనే విపరీతమైన అభివృద్ధి చెంది గ్రామం నుంచి నగర పాలక సంస్థగా రికార్డును సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం ఈ నగరం జీహెచ్ ఎంసీ విలీనంలో తన ఉనికిని కోల్పోయింది. రాజకీయ కక్షల కారణంగా నేడు సర్కిల్‌కు కూడా నోచుకోలేదు. ఇక్కడి ప్రాంత రాజకీయ నాయకులను అణగదొక్కాలనే ఉద్దేశంతో ఓ రాజకీయ నాయకుడి ఏకఛత్రాధిపత్యం కారణంగా హీరో స్థాయి నగరం.. నేడు జీరో స్థాయికి పడి పోయింది. బీఆర్ఎస్ కాలంలో రాష్ట్రంలోనే పేరు ప్రతిష్టలు ఉన్న నగరం నేడు నామరూపాలు లేకుండా పోయింది. పీర్జాదిగూడను వార్డుగా కేటాయించి బోడుప్పల్ సర్కిల్‌లో విలీనం చేయడాన్ని ఇక్కడి స్థానిక నాయకులు, ప్రజలు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీగా ఉన్న ఘట్‌కేసర్ వంటివి నేడు సర్కిల్ గా ఏర్పడగా మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉన్న పీర్జాదిగూడకు కావాలనే తీవ్ర అన్యాయం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**

**పీర్జాదిగూడ డిసెంబర్ 27 (క్విక్ టుడే న్యూస్):** గ్రేటర్ హైదరాబాద్ విస్తీర్ణం పెంచడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం తీసుకుంది. ఇది సరైన నిర్ణయమే అయినప్పటికీ దీని వెనుక ఆయా ప్రాంతాలకు చెందిన రాజకీయ నాయకుల ప్రమేయం, ప్రాబల్యంతో కొన్ని పట్టణాలకు తీవ్ర అన్యాయం జరిగింది. జీహెచ్ ఎంసీని విస్తరించడంతో హైదరాబాద్ మహానగరం దేశంలోనే అత్యంత పెద్దనగరంగా అవతరించింది. ఇందుకోసం జీవో నెంబర్ 264 ప్రకారం 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 20 మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేశారు. ఓఆర్ ఆర్ అవతలివైపున ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను సైతం విలీనం చేశారు. అదేవిధంగా జీవో నెంబర్ 291 ప్రకారం హైదరాబాద్ నగరంలో 150 వార్డులుండగా వాటిని 300లకు పెంచారు. జీవో నెంబర్ 292 ప్రకారం గతంలో జీహెచ్ ఎంసీలో 6 జోన్లు ఉండగా వాటిని 12కు పెంచారు. 30 సర్కిళ్లు ఉండగా వాటిని 60కి పెంచారు. ఇంతటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగినదే.. కానీ ఇక్కడ స్థానిక నేతల తీరుతో పలు ముఖ్యమైన పట్టణాలకు తీవ్ర అన్యాయం జరిగింది. ఇందుకు ఉదాహరణగా పీర్జాదిగూడ నగరపాలక సంస్థను తీసుకోవచ్చు. ఒకప్పుడు గ్రామాలుగా ఉన్న పీర్జాదిగూడ, బోడుప్పల్ ఒకదానితో మరొకటి పోటీ పడుతూ నేరుగా మున్సిపల్ కార్పొరేషన్‌గా ఎదిగాయి. అయితే గ్రామాలుగా ఉండి నగరపాలక సంస్థలుగా ఎదగడం రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా జంట కార్పొరేషన్లు అవతరించి రికార్డు సృష్టించాయి. ఈ రెండు మున్సిపాలిటీలు అభివృద్ధిలో నువ్వా నేనా అన్నట్లు పోటీపడుతూ పలు అవార్డులు కూడా అందుకున్నాయి. అయితే ఒక దశలో బోడుప్పల్ పేరు కంటే పీర్జాదిగూడ రాష్ట్ర, దేశ వ్యాప్తంగా వినిపించింది. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని అధ్యయనం చేసేందుకు దేశంలోని ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి స్టడీ టూర్‌లు కూడా కొనసాగాయి.

## సర్కిల్ పేరు మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

### బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి

### పీర్జాదిగూడ పేరుతో వెంటనే సర్కిల్‌ను కేటాయించాలని డిమాండ్

### రాజకీయంగా అణగదొక్కేందుకే పేరు మార్పు



**పీర్జాదిగూడ, డిసెంబర్27 (క్విక్ టుడే న్యూస్):** జీహెచ్ఎంసీ విస్తరణలో భాగంగా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ కు సర్కిల్ పేరు కేటాయించి ఇప్పుడు పీర్జాదిగూడ సర్కిల్ పేరుని తొలగించడాన్ని బీఆర్ఎస్ పార్టీ పిఎంసి ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. పీర్జాదిగూడ సర్కిల్ గా పేరును వెంటనే కేటా యించాలని డిమాండ్ చేశారు. కేవలం 5 సంవత్సరాల సమయంలో కార్పొరేషన్ పాలకవర్గం మేయర్ చేసిన అభివృద్ధి దేశంలో, రాష్ట్రంలో అనేక అవార్డులను తెచ్చిపెట్టిందన్నారు. మునిసిపాలిటీల నుండి అధికారులు స్టడీ టూర్ చేసేలా, పర్యటించేలా చేసిందని చెప్పాలి. అసెంబ్లీలో సైతం పలుసార్లు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి గురించి ప్రస్తావించడం గమనార్హం. తడి, పొడి చెత్త ను వేరువేరుగా సేకరించడం, వ్యర్థాలతో ఎరువులను తయారు చేయడం, చెత్త డంపింగ్ లేకుండా చూడడం, అట్టి వ్యర్థాల ద్వారా ఆదాయాన్ని పొందడం, అధునాతన స్మశాన వాటికను అన్ని మతాల వారికి ఒకే దగ్గర అభివృద్ధి చేయడం, అత్యదిక శాతం గ్రీనరీని తయారు చేయడం, అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ ని ఏర్పాటు చేసి మల,మూత్ర వ్యర్థాలను ఎరువుగా మార్చడం, వరదల్లో తెగిపోయిన చెరువు కట్టలను మినీ ట్యాంక్ బండ్ గా పునర్ని ర్మించడం, కరోనా ఐసోలాషన్ సెంటర్ లతో అనేక మందికి వైద్యం అందించడం, సెట్విన్ ద్వారా అనేక మంది మహిళకు, యువతీ యువకులకు వృత్తి మెలకువలు నేర్పించి ఉపాధి అవకాశాలను కల్పించడం ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పీర్జాదిగూడ పేరును రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపిన ఘనత. అలాంటి పీర్జాదిగూడ సర్కిల్ పేరును మారుస్తూ రాజకీయం చేయడం తగదని మొదట కేటాయిం చినట్లు పీర్జాదిగూడ సర్కిల్ పేరు ఉండాలని డిమాండ్ చేశారు.

## పీర్జాదిగూడకు తీవ్ర అన్యాయం..

జంట కార్పొరేషన్ల పోటాపోటీగా అభివృద్ధి నాణేనికి ఒకవైపు అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త జీవోలతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు తీవ్ర అన్యాయం జరిగింది. జీహెచ్ ఎంసీ విలీనం మంచి నిర్ణయం అయినప్పటికీ ఇక్కడి స్థానిక నేతల కుట్రలతో పీర్జాదిగూడకు నష్టం వాటిల్లింది. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ హయాంలో పీర్జాదిగూడ అభివృద్ధి చెందడాన్ని ఓర్వలేని బోడుప్పల్ కాంగ్రెస్ నాయకులు నేడు ఆ పేరు వినిపించకుండా చేశారు. మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉన్న నగరాన్ని కనీసం సర్కిల్ చేయాలనే ఆలోచన చేయకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. బోడుప్పల్ సర్కిల్‌ల్ పీర్జాదిగూడ, మేడిపల్లి వార్డులను విలీనం చేయడం దుర్మార్గపు చర్య అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోడుప్పల్ అనుకుని ఉన్న మల్లాపూర్, చిలుకానగర్, చర్లపల్లి వంటి వార్డులను కాదని మేడిపల్లి, పీర్జాదిగూడ వార్డులను చేర్చడం రాజకీయ కక్ష తప్ప మరొకటి లేదని పేర్కొంటున్నారు. గతంలో మున్సి పాలిటీలు ఇప్పుడు సర్కిళ్లుగా ఏర్పడగా మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉన్న నగరం వార్డుగా మార్చడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుడి కారణంగానే పీర్జాదిగూడకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీర్జాదిగూడకు చెందిన నాయకులను అణగదొక్కి ఏకఛత్రాధిపత్యం చెలాయించేందుకు ఎత్తుగడలు వేసినట్లు వాపోతున్నారు.